# కాశ్మీర మజిలీలు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు

దారి తెలిసినవానివలె పొట్టిపిచికి చరచర నడువగడంగినాడు. నడుమ నడుమ వాడాలపించుపాట దట్టమైన చేనులో నిరువదిగజముల దూరమునుండి వినబడుచుండెను. ఇంతలో "మర్గయా! మర్గయా! సాప్! బాబ్జీ! సాప్!" ("చచ్చితిని! చచ్చితిని! పాము! అయ్యో! పాము!") అను కేకలు వినబడినవి. నా ప్రాణములు నిలువున నెగసిపోయినవి. పాపము బుడంకాయి బ్రతుకు తెల్లవారినదని యడవి మొక్కలలో జొరబడి వడివడిగ ముందులకు పోతిని. "భయపడకుడు! భయపడకుడు!"అని యఱచుచు బోండా శరీరమును మఱింత బలముగ ముందుల కీడ్వదొడగినాడు. బుడంకాయి నేలబడి పొరలుచు, గ్రుక్కత్రిప్పుకొనక రోదనముచేయ సాగినాడు. "భయములేదు. పామేది?" అని యఱచుచు వానిని సమీపించి సమీప స్థానమును పరీక్షించితిని. నాకు పామేమియు కనబడలేదు. కఱచి మొక్కలలోనికి పాఱిపోయినదని తలచితిని. "కఱచినది కఱచినది!"అని వాడు గిజగిజ తన్నుకొనుచున్నాడు. కాలును పరిశీలించితిని. వాడియైన ముల్లొకటి అరికాలులో గ్రుచ్చుకొని యున్నది. పొంతనే ముండ్లకంపకలదు. కఱచినది పాముకాక, ముల్లని గ్రహించి "పాముకాదురా! చూచుకొమ్ము! ముల్లని" దానిని వానికి జూపి వాని సంశయమును దీర్చితిని. హఠాత్తుగ వాడు రోదనమును చాలించినాడు. ఇంతలో బోండా మమ్ము సమీపించి "కఱచినదేమి పాము? పామేది?"అని వగర్చుచు ఆతురతతో ప్రశ్నించినాడు. "అహ్హా హ్హా!"అని నవ్వి పిచికిగాడు లేచి నిముసములో. మాకడనుండి తుఱ్ఱుమని పాడుచు నాడుచు ముందులకు పోయినాడు. పయనమైనపిదప రెండుగంటలు కడచినవి. ఇంకను ఊరు సాక్షాత్కరింపలేదు. బోండా "మైలు దూరమే"యని చెప్పినాడు. కాని యీ మైలు ఏలోకమునకు సంబంధించినదో? ఇది బ్రహ్మగారి లెక్కలోని మైలై యుండును. ఈ మైలు ఇంతలో కడచునను ఆశ హృదయమునుండి అంతర్థానమైపోయినవి. నోరుమూసికొని యుండలేక "అయ్యో! మీ యూరింకా యెంతదూరములో నున్నదని" నడుమనడుమ బోండాగారిని ప్రశ్నించుచుంటిని "కరీజెయ్! బిలోకులో-కరీజెయ్!" (దగ్గఱే! బొత్తుగా దగ్గఱే!")అని అతడు బదులు చెప్పుచున్నాడు. కాని చేనే అంతులేనిదై తోచుచున్నది. అనంతమైన యీ పొలము దాటిన పిదప "మైలు దూరములోని యూరును" చూచుట కెంతసేపు నడువవలెనో! కిక్కురుమనకుండ కాలు సాగించుచుంటిని. మరల "బాబారే!" అను కేక వినబడినది. నా యొడలు కంపించినది. దైవికముగ దరిజేరు

కష్టములుకొన్ని! ఈ పొట్టిపిచికి-ఫూల్ వలన దాపురించే చిక్కులుకొన్ని! అని చిరచిర లాడుచు చరచరముందులకు పోతిని. ఒక బురదగోతిలో బుడంకాయి పడియున్నాడు. "ఏమిరా? బురదలో శయనించినావు?" అని ప్రశ్నించితిని "గిర్ పడా! గిర్ గయా!" (పడ్డాను! పడిపోయాను) అని లేచుటకైన ప్రయత్నింపక వాడట్లేపడియున్నాడు. "దేవర వారిని లేవదీయవలెనా? లే!" అని గద్దించి పల్కితిని. కూనిరాగముదీయుచు వాడు లేచినాడు. "వానిమూటేది?" అనియడిగితిని. "అదిగో" అని గోతిమూలబాడిలో బడియున్న మూటను వాడు చూపినాడు. అది సగము విడిపోయినది. అందుండి హైదారు మిఠాయి యుండలు బురదలో జారిపడినవి. కొంపమునిగినది. మూటనీయ నిష్టపడని బోండాచేతినుండి దీసి వీని కిచ్చినందులకు తగిన ప్రతిఫలమే కనుపించినది. ఇపుడు బోండాకెట్టి సమాధానము చెప్పుదును దేవుడా! అని విలవిల దన్నుకొంటిని. మూటలో మిఠాయి యున్నదని గ్రహించిన బుడంకాయి దానిని విప్పి మఱింత బీభత్సము చేయుగడగినాడు. కనులెఱ్ఱజేసి, వానిని కసరికొట్టి మరల బిగించి మూటగట్టినాను. జాఱిపడిన మిఠాయి యుండలను అట్లే విడచివేసితిని. గోతికి కొంత దూరమున నిలిచి, బోండా అచటికి వచ్చినంతనే అందుండి చరచర నడిచితిని. మూటకు వాటిల్లిన విపత్తును గుఱించి వానితో నేమియు చెప్పితినిగాను. విషయము దెలిసికొన్న యెడల, ప్రాణాధికములైన ఉండలకై అతడు వలవల యేడ్చియుండును. లేదా మమ్ముల నిరువురను ఉండలనుజేసి గుటుక్కున దిగమ్రింగి యుండును. అంతపని చేయకపోయినను "మీాతెన్ను మీారు చూచుకొనుడని" మమ్మా చేనినడుమ నా రాత్రి దిగవిడిచి తనదారిని దాను పోయి యుండును. తరువాత కానున్నది కాకమానదని మూట మాటెత్తక "భయ్యా! ఎంత దూరము?" అని బోండాను ప్రశ్నించితిని. "కరీబెయ్! కరీబో కరీబెయ్!" అనుచు నతడు నడచుచునే యున్నాడు. గోతిలో కూలబడినపుడు బుడంకాయి కాలు మడతబడుటచే నీ పర్యాయము ముందుల కుఱుకక కుంటుచు, మాతోడనే వాడు నడచుచు, నొకయుంజ వెనుకకే వేయుచున్నాడు. కొంతదూరమునుండి కుక్క మొఱుగుడు వినబడినది. అది చేనులో దూరమున నున్న నేదేని యరపనుండి వినవచ్చినదో యూరి నుండి వినవచ్చినదో గ్రహింపజాలనైతిని. "భయ్యా! అవుర్ కిత్నా దూర్ హై?" ("అన్నయ్యా! ఇంకెంతదూరము?") అని మరల బోండాను ప్రశ్నించితిని. "కరీబ్ కరీబేయ్! బిల్‌కుల్ కరీబేయ్!" అని ప్రత్యుత్తర మొసగినాడు. చిన్నప్పుడు చదువుకొనిన చిత్రమైన కథలును, గాథలును తలపునకు వచ్చినవి. "బోండా రూపుదాల్చి ఏ బ్రహ్మరాక్షసియైన మమ్ముల నిద్దఱను మ్రింగివేయ నీ డొంకలలోనికి గొనిపోవుచున్నదేమో! నా కాశ్మీరమజిలీ ముండ్లపొదలలోనే కడముట్టునేమో!" అని యడలుచు నడువదొడగితిని. ఊరు కన్నులబడనే లేదు.